మానసిక రోగుల రక్షణ పట్టదా?

- ఎర్రగడ్డ ఆస్పత్రి నుంచి తరచూ రోగుల పరారీ
- రక్షణ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడమే కారణం
- పట్టించుకోని అధికారులు



ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి ఎవరు వస్తున్నారో ఎవరు వెళ్తున్నారో ఎవరికీ పట్టడం లేదు. ఇక్కడకు ఎవరైనా రావచ్చు, పోవచ్చు అనేలా పరిస్థితి ఉంది. ఆస్పత్రి నుంచి రోగులు బయటకు వెళ్తున్నా పట్టించుకునే వారు ఉండరు. మానసిక చికిత్సాలయం ఇతర ఆస్పత్రుల్లో మాదిరిగా కాకుండా భద్రత కట్టుదిట్టంగా ఉండాలి. రాకపోకలపై నిషేధం ఉండాలి. ఎవరుపడితే వారు లోనికి రాకూడదు. ఆస్పత్రిలోని రోగులు బయటకు వచ్చేందుకు వీలు ఉండకూడదు. అయితే ఇక్కడ రక్షణ వ్యవస్థ సరిగా లేదు. పారిపోవడానికి మార్గాలు అనేకం ఉన్నాయి. దీంతో తరచూ అనేక మంది రోగులు పారిపోతున్నారు. కొందరు అదృశ్యమవుతున్నారు. గతంలో ఈ ఆస్పత్రిలో జాతీయ మానవ హక్కుల సంఘం బృందం పర్యటించి ఇక్కడి పరిస్థితిపై ఒక నివేదిక అందజేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదు. మానసిక చికిత్స కోసం వచ్చే రోగులు, ఖైదీలు ఇక్కడి నుంచి పారిపోవడం సర్వసాధారణమైపోయింది. గతంలో ఇక్కడి నుంచి ఒకేసారి 12 మంది ఖైదీ రోగులు పారిపోయారు. ఆ తర్వాత మరోసారి ఖైదీ పారిపోగా.. ప్రతినెలా కొందరు రోగులు పారిపోతూనే ఉన్నారు. ఆస్పత్రి చుట్టూ కట్టుదిట్టమైన రక్షణ వ్యవస్థ లేకపోవడం వల్లే రోగులు బయటకు వెళ్తున్నారు.

సరిపడా సెక్యూరిటీ లేకపోవడంతో..

మానసిక ఆస్పత్రిలో సరిపడా సెక్యూరిటీ లేదు. ఓపెన్ వార్డులో తప్ప మిగతా వార్డుల్లో రోగుల రక్షణ బాధ్యత ఆస్పత్రి సిబ్బందిదే. అయితే ఇక్కడ అవసరమైన మేర సిబ్బంది లేకపోవడంతో రోగులను కనిపెట్టుకుని ఉండడం కష్టమవుతోంది. ఇక రాత్రి అయితే రోగుల గురించి పట్టించుకునే పరిస్థితే లేదు. మరోవైపు పదిమంది ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ వారి పనితీరు సరిగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోగుల సంఖ్యకు అనుగుణంగా సెక్యూరిటీ లేకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

సులువుగా బయటకు వెళ్లేందుకు మార్గాలు..

మానసిక ఆస్పత్రి నుంచి సులువుగా బయటకు వెళ్లిపోవడానికి పలు మార్గాలు ఉన్నాయి. ఒకటి ఎర్రగడ్డ రైతు బజార్ వైపు, మరొకటి ఏజీ కాలనీ వైపు, ఇంకోటి ప్రధాన రహదారి. ఈ మూడు ద్వారాల నుంచి ఎవరైనా రావచ్చు, ఎవరైనా వెళ్లిపోవచ్చు. ఈ మూడు మార్గాల నుంచి అనేక మంది రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఆస్పత్రి వెనుక వైపు ప్రహరీగోడ పగులగొట్టి ఉంది. ఈ ద్వారం ద్వారా ఎవరైనా వెళ్లిపోవచ్చు. కట్టుదిటమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయడం, అవసరం మేరకు సెక్యూరిటీని నియమించడం వంటి విషయాలపై అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రహరీగోడ విషయంపై ఆస్పత్రి అధికారులు ఎన్నోమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. మానసిక రోగులు పారిపోవడానికి ప్రధాన కారణం కిటికీలు, వెంటిలేటర్లే. ఇవీ పటిష్టంగా లేకపోవడంతో రోగులు సులువుగా తప్పించుకుంటున్నారు. కిటికీలను గ్రిల్‌తో గట్టిగా తయారు చేసినట్లయితే ఈ ఘటనలను నివారించవచ్చని పలువురు చెబుతున్నారు.

సిబ్బంది ఉన్నా పారిపోతున్న ఖైదీలు..

ఖైదీలకు చికిత్స అందించే ఫోరెన్సిక్స్ వార్డు వద్ద రోగుల భద్రత పూర్తిగా పోలీసు వ్యవస్థదే. ఇందుకోసం ప్రతి షిఫ్ట్‌లో ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటున్నారు. ఆస్పత్రి పాలకవర్గం సైతం ఇద్దరు సిబ్బందిని నియమించింది. ఇంతమంది ఉన్నా ఇక్కడి నుంచి ఆరుగురు ఖైదీలు పారిపోయారంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఆరోగ్య, విద్యా శిబిరంలో పాల్గొన్న నీలిమ తదితరులు

అవకాశాలను వినియోగించుకుంటే గొప్ప భవిష్యత్తు

- విద్యార్థులకు కోట నీలిమ సూచన

అమీర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటే విద్యార్థులకు గొప్ప భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ హరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య విద్యా శిబిరానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. తానూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, శుభ్రత, తాగునీటి సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.


పారిశుధ్య కార్మికులకు రగ్గులను అందజేస్తున్న ఈవో అన్నపూర్ణ

పారిశుధ్య కార్మికులకు రగ్గుల పంపిణీ

అమీర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్, జెక్‌కాలనీ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జెక్‌కాలనీకి చెందిన పలువురు మహిళలు సోమవారం రగ్గులను పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త ఆటోలకు ఇవ్వాలని సూచించారు. చెత్త, వ్యర్థాలను తరలించి ప్రజల ఆరోగ్య పరిరక్షకులుగా కార్మికులు సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రగ్గుల దాతలు హైమావతి, హరిత, భాగ్యలత, కృష్ణకుమారి, విజయలక్ష్మి, అమరావతితో పాటు జెక్‌కాలనీ సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ అమృత అపార్టుమెంట్స్, ఈ -సేవ, ఇంజనీర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ దేవరకొండ బస్తీ, అక్బర్ ఫామ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

25, 26 తేదీల్లో అయ్యప్పస్వామి మండల పూజలు

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీటీఎస్ కాలనీలోని వీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప సహిత సాయిబాబా ఆలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో అయ్యప్పస్వామి మండల పూజ మహోత్సవం నిర్వహించనున్నారు. 25న ఉదయం లక్ష్మీగణపతి హోమం, సర్వాభిషేకం, భజన, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి గుమ్మడిదళ్ల సుధాకర్ తెలిపారు. 26న సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. అయ్యప్పస్వాములకు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.


శాంటాక్లాజ్‌తో ఫొటోలు దిగుతున్న సందర్శకులు

'వింటర్ మేళా'లో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు

ఖైరతాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురస్కరించుకుని పీపుల్స్‌ప్లాజాలో జరుగుతున్న వింటర్ ఉత్సవ్ మేళాలో సందడి నెలకొంది. కశ్మీర్ అందాల అనుభూతి పొందేలా ఏర్పాటైన ఈ మేళాలో క్రిస్మస్ సందర్భంగా శాంటాక్లాజ్‌లతో పాటు పలు రకాల బొమ్మల రూపంలో ఉన్న కళాకారులతో కుటుంబాల సమేతంగా ఫొటోలు దిగుతూ నగరవాసులు సందడి చేస్తున్నారు. కశ్మీర్‌లో ఉండే చలితో పాటు అక్కడి జలపాతాలు, మంచు కురుస్తున్నట్లు చేసిన సెట్టింగ్, అక్కడి ఉద్యాన వనాలు, పలు రకాల జంతువులు, వాతావరణం కనిపిస్తుండడంతో రోజురోజుకు మేళాకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ప్రదర్శనలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన పలు వస్తువులతో కూడిన స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. తక్కువ ధరలకే స్వెటర్, చలిని తట్టుకునే టోపీలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. దీంతో పాటు పలు రకాల ఎమ్యూజ్‌మెంట్లు, ఎన్నో రకాల తినుబండారాలతో వింటర్ మేళా కళకళలాడుతోంది. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్‌బేగ్ తెలిపారు.



యూనివర్సిటీలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి తదితరులు

అంబేడ్కర్ వర్సిటీలో క్రిస్మస్ వేడుకలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సోమవారం క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్వీకే రెడ్డి, ఇన్‌చార్జి అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఐ.ఆనంద్ పవార్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ మాట్లాడుతూ.. మతాలపై విశ్వాసం ఉన్నా లేకున్నా ఇతరుల అభిప్రాయాలను గౌరవించాలని పేర్కొన్నారు. మనుషులను మనుషులుగా గౌరవించడం ముఖ్యమని అన్ని మతాలు చెబుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయన యూనివర్సిటీలోని ఉద్యోగులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రవీంద్రనాథ్ సోలమన్, ప్రొ.జి.మేరీసునంద, డా.ఉదయిని, దివాకర్, ధర్మ కల్యాణ్, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలు

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. లక్డీకాపూల్‌లోని లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ జీవన్ కుమార్ క్రీస్తు జనన విధానం గురించి వివరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాల నాయుడు, కార్యవర్గ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. సీనియర్ పాత్రికేయుడు సుశీల్ కుమార్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షురాలు వనజ, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి రాజేష్, కార్యవర్గ సభ్యులు వసంత్, పద్మావతి, శ్రీనివాస్, రమాదేవి, పాత్రికేయులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క


స్టాళ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

మోతీనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలందరినీ కోటీశ్వరులుగా తయారుచేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం మాదాపూర్‌లోని దస్పల్లా హోటల్‌లో జరిగిన అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులను నగరంలోని శిల్పారామంలో అమ్ముకునే విధంగా చేసినట్లే, ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఏర్పాట్లు చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల మేర మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటులో మహిళలను భాగస్వామ్యం చేసేందుకు తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు స్టాళ్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, తాము అధికారంలోకి వస్తే మేలుచేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, కోశాధికారి ఎస్‌డీ మోయిన్, రాజ్ కుమార్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యమ నాయకుడే సీఎం అయ్యాడని, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుతాయనుకుంటే కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులను పట్టించుకోక పోగా, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి తమ పార్టీని గెలిపిస్తే ఉద్యమకారులకు ఇంటి స్థలం, పింఛన్ ఇవ్వడంతో పాటు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టి సంవత్సరం అయినా ఉద్యమకారులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ఆయన నెరవేర్చలేదని విమర్శించారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన ఉండాలి

- వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు



వినియోగదారుల హక్కుల సంస్థలో చేరిన మహిళలు, నూతన కార్యవర్గం

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు సంస్థలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు ఎన్నో హక్కులు ఉన్నా సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. మార్కెట్‌లో అనేక రకాలుగా వినియోగదారులను వ్యాపారులు మోసం చేస్తుంటారని, నాసిరకం వస్తువుల అమ్మకాలు, సర్వీస్ లోపం, తినుబండారాల్లో కల్తీ, తప్పుడు ప్రచారాలు, తప్పుడు ప్రమాణాలు, బై వన్ గెట్ వన్ ఆఫర్లు.. ఇలా అనేక రకాలుగా వినియోగదారులు మోసపోతూనే ఉన్నారన్నారు. అయితే మోసపోయిన విషయం వారికి తెలియకపోవడంతో ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోతున్నారని ఆయన అన్నారు. వినియోగదారులు తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సంస్థ మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.ఎస్.వీణ, ప్రధాన కార్యదర్శిగా జీఎల్ ప్రీతి తదితరులు ఎన్నికయ్యారు.


ఫిల్మ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ క్లీనింగ్ మెషీన్‌లను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

విద్యార్థుల మానసిక ఎదుగుదలకు కృషి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో స్వచ్ఛత, విద్యార్థుల మానసిక ఎదుగుదలకు కృషి చేస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఫిల్మ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో వసతుల మెరుగుదలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఉపయోగపడే డ్యూయల్ డెస్కులు, టాయిలెట్ క్లీనింగ్ మెషీన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచటం ద్వారా విద్యార్థుల చదువును ముందుకు తీసుకువెళడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.


అమీర్‌పేటలో వెల్‌వర్క్ వర్క్‌స్పేస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ వర్క్‌స్పేస్

- మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో మంచి వర్క్‌స్పేస్ లభ్యమవతుందని, ఇక్కడ ధరలు కూడా తక్కువగా ఉన్నాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అమీర్‌పేట ఎంపీఎం మాల్‌లో వెల్‌వర్క్ వర్క్‌స్పేస్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నగరంలో పశ్చిమ ప్రాంతంలోనే ఐటీ స్పేస్ ఉందని, ప్రస్తుతం సెంట్రల్ హైదరాబాద్‌లోనూ ఐటీ, స్టార్టప్ కంపెనీల కోసం స్పేస్ అందుబాటులోకి రావటం మంచి పరిణామమన్నారు. దీని వల్ల నగరం అన్ని వైపులా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల ద్వారా ఉపాధిని పెంచేదిశగా ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. నగరం చుట్టూ ఉన్న ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాలలోనూ వర్కింగ్ స్పేస్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రేవతి కుటుంబానికి రూ.20 కోట్లు ఇవ్వాలి

- గజ్జెల కాంతం

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో మృతిచెందిన రేవతి కుటుంబాన్ని అల్లు అర్జున్, సినీ పరిశ్రమకు చెందిన వారు పరామర్శించకపోవడం దారుణమని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. మృతురాలి కుటుంబానికి 20 కోట్లు ఇవ్వాలి ఆయన డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. అల్లు అర్జున్‌కు మానవత్వం ఉంటే రేవతి కుటుంబాన్ని, ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య ఉన్న శ్రీతేజను పరామర్శించే వారన్నారు. ఆయన 12 గంటలు జైలుకు వెళ్తే 1200 వందల మంది ఆయన్ను పరామర్శించేందుకు వచ్చారని, మృతురాలి కుటుంబాన్ని పరామర్శించడానికి వారంతా ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మృతురాలి కుటుంబానికి రూ.20 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



అభివాదం చేస్తున్న పిడమర్తి రవి, కాంతం, వివిధ సంఘాల నాయకులు

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 2న ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మంద కృష్ణమాదిగ తీరుతో మాదిగ జాతికి నష్టం వాటిల్లుతోందన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వర్గీకరణ ఉద్యమంలో మంద కృష్ణమాదిగ తమ సామాజిక వర్గం విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం మాదిగ జాతి ఒక సంధికాలంలో ఉన్నట్లు అనిపిస్తోందని.. ఉద్యమంలో విద్యార్థులను, యువతను భాగస్వాములను చేసేందుకు ఫిబ్రవరి 2న నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై స్పష్టంగా ఉన్నారని, ఆయన వెంట నడిచి 12 శాతం రిజర్వేషన్లను సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో వి.చంద్రశేఖర్, పి.నాగేష్, బుదాల బాబూరావు, బొమ్మెర స్టాలిన్, బి.బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, ఆయాలు

ఆయాలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్
- మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

పంజాగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు అక్టోబరు, నవంబరు వేతనాలను వెంటనే చెల్లించాలని శిశు విహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయం ఎదుట ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఆయాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెలా 7వ తేదీ లోపు కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్ అశోక్, ఉపాధ్యక్షురాలు సుశీల, శ్యామల, కవిత, సాయి శేషగిరిరావు, భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వండి : జీఎం


మాట్లాడుతున్న జీఎం ఏకే జైన్, అదనపు జీఎం అగర్వాల్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైళ్ల నిర్వహణలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం రైల్వే సేఫ్టీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. అరుణ్‌కుమార్‌జైన్ మాట్లాడుతూ..రాబోయే రుతుపవనాలను దృష్టిలో ఉంచుకుని రైలు కార్యకలాపాల పర్యవేక్షణ, భద్రతా పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. అలాగే, రైళ్ల సమయపాలనను విధిగా పర్యవేక్షించాలని, ట్రాక్‌ల నిర్వహణను ఆకస్మికంగా తనిఖీలు చేయాలన్నారు. సేఫ్టీ అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి తరచూ కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. జోన్ పరిధిలో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు తదితర భద్రత సంబంధిత నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు జనరల్ మేనేజర్‌కు తెలిపారు. సమావేశంలో రైల్వే అదనపు జీఎం నీరజ్ అగర్వాల్, అన్ని డివిజన్ల రైల్వే మేనేజర్లు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమానికి హాజరైన బస్తీ యువత

బస్తీ సమస్యలు- పరిష్కారంపై అవగాహన

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బస్తీ సమస్యలు సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కారం అయ్యేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై దివ్యదిశ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో బస్తీల్లో నీటి సమస్యవీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం స్థానిక నాయకులకు, అధికారులకు ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఫిలిప్స్, మూసా ఖాన్, దీపక్, ప్రియాంక, నాగరాజు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్‌ను నిర్మించాలి : సీపీఎం

అడ్డగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలో సగంలో ఆగిపోయిన మల్టీపర్పస్ నిర్మాణపనులను చేపట్టి పేదప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను సీపీఎం సికింద్రాబాద్ జోన్ కమిటీ కోరింది. సోమవారం సీపీఎం నాయకులు ఎం.అజయ్‌బాబు, ఆర్.మల్లేష్, బి.శారద, షేక్ ఫాతిమా తదితరులు జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.


బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

నీటి కాలుష్య సమస్యను పరిష్కరిస్తాం

చిలకలగూడ, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ పరిధి చింతల్ బస్తీలోని ప్రజలు ఎదుర్కొంటున్న కలుషితనీటి సమస్యను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొన్న కార్పొరేటర్ రాసూరి సునీత జలమండలి అధికలరులతో కలిసి సోమవారం బస్తీలో పర్యటించారు. సమస్య విషయమై స్థానికులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

బొల్లారంలో మినీ క్రిస్మస్ వేడుకలు

తిరుమలగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని హోలీ ట్రినిటీ చర్చిలో సోమవారం సాయంత్రం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల నృత్యాలు, యేసు క్రీస్తు నాటిక, పాటలు, ఆహలాతులను అలరించాయి. రెవరెండ్ చార్ల్స్ వెస్లీ, చర్చి కార్యదర్శి సుందర్ రావు కార్యక్రమాలను పరిశీలించారు.

అయ్యప్ప దేవాలయంలో ఘనంగా పూజలు

తిరుమలగిరి డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం స్వామికి ఘనంగా పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారణ స్వీకరించిన స్వాములు, వారి కుటుంబ సభ్యులు పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.


గణిత ఉత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు.

గణిత ఉత్సవాలు

పద్మారావునగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గణిత ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత సూత్రాలను, వివిధ పద్ధతుల ద్వారా గణిత సమస్యలను సులభంగా ఎలా చేయాలో వివరించారు.

ప్రజల చెంతనే వైద్యసేవలు

సత్ఫలితాలిస్తున్న బస్తీ దవాఖానాలు



పనివేళలు..
- సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- శనివారం సెలవు
- ఆదివారం మధ్యాహ్నం వరకు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో అందుబాటులోకి తెచ్చిన బస్తీ దవాఖానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వైద్యం కోసం జేబులు ఖాళీ చేసుకునే అవకాశం లేకుండా ప్రభుత్వం ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఏ చిన్న పాటి అనారోగ్యం అయినా చికిత్స కోసం ప్రైవేట్ వైద్యులను సంప్రదిస్తే కనీసం ఐదు వందలకు తక్కువ కాదు. అదే బస్తీ దవాఖానకు వెళ్తే రూపాయి ఖర్చు లేకుండా చికిత్స అందిస్తున్నారు. చిన్న అనారోగ్య సమస్యలు ఉన్నా వైద్య ఖర్చులకు భయపడి సరైన సమయంలో వైద్యం చేయించుకోక పెద్ద సమస్యగా మారేది. కానీ ఇప్పుడు పైసా ఖర్చు లేకపోవడంలో వెంటనే బస్తీ దవాఖానకు వెళ్లి వ్యాధి ముదరక ముందే జాగ్రత్త పడుతున్నారు.

మోండా డివిజన్‌లో మూడు బస్తీ దవాఖానాలు

మోండా డివిజన్‌లో చుట్టలబస్తీ యూపీహెచ్‌సీ పరిధిలో మూడు బస్తీదవాఖానాలు ఉన్నాయి. సాంబమూర్తి నగర్, శివాజీ నగర్, చాపల బాయి బస్తీ దవాఖానాల్లో వైద్యుడితో పాటు జీఎన్‌ఎం, సహాయకుడు ఉంటాడు.

వైద్య చికిత్సలు

జలుబు, జ్వరం, తలనొప్పి, బీపీ, షుగర్ వ్యాధులకు వైద్యం అందుబాటులో ఉంటుంది. రెగ్యులర్‌గా వ్యాక్సీన్‌లు కూడా అందిస్తారు. బస్తీ దవాఖానాల్లో కానప్పుడు ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు.

60 రకాల ల్యాబ్ పరీక్షలు..

డయాబెటిక్, థైరాయిడ్, లివర్ ఫంక్షన్, రీనల్ ఫంక్షన్, లిపిడ్ ప్రొఫైల్, సీరమ్ ఎలక్ట్రోలైట్స్, పాథాలజీ,మైక్రోబయాలజీకి సంబంధించిన 60 రకాల ల్యాబ్ పరీక్షలను ఉచితంగా చేస్తారు. ల్యాబ్ పరీక్షలకు సాంపిల్ ఇచ్చిన వారికి ల్యాబ్ రిపోర్టు ఫోన్‌కు మెస్సేజ్ పంపిస్తారు.

రోజుకు 50-60 మంది..



రోజూ ఓపీ రోగులు 50 నుంచి 60 మంది వస్తారు. ల్యాబ్ పరీక్షలకు 10 -15 మంది వస్తారు. బీపీ, షుగర్ మందుల కోసం రెగ్యులర్‌గా వస్తుంటారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను బస్తీవాసులు వినియోగించుకోవాలి.

- స్వప్న, జీఎన్ఎం, చాపలబాయి

మందులు ఇచ్చి, జాగ్రత్తలు చెబుతారు



మా సొంతూరు కొల్లూరు. పని మనిషిగా చేస్తున్న. రెజిమెంటల్ బజార్‌లో ఉంటున్నా. నాకు బాగ లేకుంటే చాపలబాయిలోని బస్తీ దవాఖానకు వస్తుంటా. మందులు ఇచ్చి, జాగ్రత్తలు చెబుతారు.

-లక్ష్మి, రెజిమెంటల్‌బజార్

తగ్గకపోతే పరీక్షలు చేస్తారు



కుమ్మరిగూడలో ఉంటాను. ఒంట్లో బాగ లేకపోతే బస్తీ దవాఖానకు వస్తాను. ప్రవేట్‌కు వెళ్లను. తగ్గక పోతే పరీక్షలు చేస్తారు. బస్తీ దవాఖానాల వల్ల పైస ఖర్చు లేకుండా ఆరోగ్యం బాగుచేసుకోవచ్చు.

- పల్లవి, కుమ్మరిగూడ

జైలులో పరిచయం.. బయట దందా

- డ్రగ్స్ విక్రయిస్తున్న పాత నేరస్తులు
- ఇద్దరు పెడ్లర్లు, ఒక కొనుగోలుదారుడు అరెస్ట్
- రూ.3.35 లక్షల విలువైన మత్తు పదార్థం స్వాధీనం


నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు డ్రగ్ పెడ్లర్లతో పాటు డ్రగ్స్ కొనుగోలుదారుడిని సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అంబర్‌పేటకు చెందిన సోలోమన్ సుశాయిరాజ్(33) డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు 2021లో స్థానికంగా గంజాయి కొనుగోలు చేయడంతో పాటు తన స్నేహితుడు అబ్బుతో కలిసి బెంగళూరు, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లి ఎండీఎంఏ, చరస్, ఎక్స్‌టసీ పిల్స్ కొని నగరంలో విక్రయిస్తున్నాడు. డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని అంబర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సోలోమన్ తిరిగి డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. డ్రగ్స్ విక్రయిస్తున్న సోలోమన్‌ను 2023లో ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్ట్‌చేసి జైలుకు తరలించారు. జైలులో అతడికి గంజాయి కేసులో అరెస్టయిన గౌస్ పరిచయమయ్యాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు కలిసి డ్రగ్స్ దందా చేయడం ప్రారంభించారు. బెంగళూరులో డ్రగ్స్ విక్రేత నుంచి కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీలు కొనుగోలు చేసి వారు సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అంబర్‌పేట పోలీసులు కలిసి వీరిద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.3.35 లక్షల విలువైన 6 గ్రాముల కొకైన్, 15 గ్రాముల ఎండీఎంఏ, 2 ఎల్ఎస్‌డీ బ్లాట్లు, డ్రగ్‌సేవించే కిట్, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

యువతను వ్యవసాయం వైపు ఆకర్షించాలి

వ్యవసాయశాఖ మాజీ మంత్రి డాక్టర్ రఘువీరారెడ్డి


డాక్టర్ ఎస్.రఘువీరారెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన యువత వ్యవసాయం వైపు ఆకర్షించే విధంగా మనమందరం దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి సూచించారు. లేకపోతే భవిష్యత్ తరాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తోందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం వర్సిటీ ఆడిటోరియంలో వైస్‌చాన్స్‌లర్, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎస్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయం లాభసాటిగా ఉండకపోవడం వల్లనే రైతులు సంక్షోభం ఎదుర్కొంటున్నారని, దీని నివారణకు వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిష్కారాలు సూచించాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ అంశాలకు సంబంధించి తాను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక ఇస్తానని హామీ ఇచ్చారు. 2004 - 2014 మధ్య వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక వెలుగు వెలిగిందని ఆ తర్వాత వెలుగులు మసకబారిపోయాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కల వేణుగోపాల్ అన్నారు. అందరి సహకారంలో వజ్రోత్సవాలు విజయవంతంగా ముగిశాయని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. గత చరిత్రను స్మరించుకుంటూ భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఈ వజ్రోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. 2025 జనవరి నాటికి వర్సిటీకి పూర్తిస్థాయి యూనివర్సిటీ అధికారులను నియమించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

వైస్ చాన్స్‌లర్‌కు అభినందనలు

వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన 60 రోజుల్లోనే వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించిన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను విద్యార్థులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు అభినందించారు.

బైకును ఢీకొట్టిన లారీ

- ఇద్దరు డిప్లొమా విద్యార్థులకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


ప్రమాదానికి కారణమైన టిప్పర్

హయత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న లారీ బైకు పైన వస్తున్న ఇద్దరు విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన విద్యార్థులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన రాజాపతి(20), అదే జిల్లాలోని సుద్దాల గ్రామానికి చెందిన అభిరాం(16) అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిందరు హయత్‌నగర్ భాగ్యలత కాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ డిప్లొమా చేస్తున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు బైకు పైన కళాశాలకు వెళ్లారు. మధ్యాహ్నం 1.30గంటలకు కళాశాల నుంచి హాస్టల్‌కు వస్తున్నారు. పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు చేరుకోగానే కొహెడా సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వస్తున్న టిప్పర్ విద్యార్థుల బైకును వేగంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలకు గురై రోడ్డు పైన పడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే హయత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలకు గురైన ఇద్దరిని హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రాజాపతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అభిరాం కాలుకు తీవ్ర గాయమైందని తెలిపారు. ఇద్దరికి తలకు ఇతర భాగాలకు కూడా గాయాలు అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్ర గాయాలకు గురై అపస్మారకస్థితికి చేరుకున్న అభిరాం, రాజాపతి


స్టాళ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

మహిళలను కోటీశ్వర్లను చేయడమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

మోతీనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలందరినీ కోటీశ్వరులుగా తయారుచేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మాదాపూర్‌లోని దస్పల్లా హోటల్‌లో జరిగిన అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులను నగరంలోని శిల్పారామంలో అమ్ముకునే విధంగా చేసినట్లే, ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఏర్పాట్లు చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల మేర మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటులో మహిళలను భాగస్వాములను చేసేందుకు తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు స్టాళ్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి ప్రతిభావంతులకు బహుమతులను అందజేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ




రాణిగంజ్‌లోని ఆదయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ఖైరతాబాద్ వాసవిసేవా సంస్థ ఉచిత నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు దయాకర్, ముఖ్య అతిథిగా ప్రకాష్, సభ్యులు శ్రీనివాస్, ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)

పీవీఎన్‌ఆర్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


పీవీ నరసింహారావు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు. పీవీఎన్ఆర్ వర్ధంతి సందర్భంగా సోమవారం పీవీ మార్గ్‌లోని పీవీ జ్ఞాన్ భూమి వద్ద ఆయన సమాధికి నివాళులర్పించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ.... తన పాలన తీరుతో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకొచ్చి ప్రపంచ దేశాలకు మన దేశాన్ని ఆదర్శంగా నిలిపారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం పీవీ నరసింహారవుకు భారతరత్న ఇవ్వడం ఆయన దేశానికి అందించిన సేవలకు లభించిన సముచిత గౌరవమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంగోపాల్‌పేట్, బేగంపేట డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శేఖర్, శ్రీహరి, మహేందర్, ఆరీఫ్, కోటేశ్వర్ గౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మోండా మార్కెట్ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు నష్టపోయిన బాధితులకు వెంటనే నష్టపరిహారం అందిస్తే ఆసరాగా ఉంటుందని, కాలయాపన చేయడం సరైనది కాదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన షాపులను సోమవారం పరిశీలించి, బాధితులకు వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వంద సంవత్సరాల చరిత్ర కలిగిన మోండా మార్కెట్ సమగ్ర అభివృద్ధికి త్వరలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. మార్కెట్‌లో పశువుల సంచారం, రాత్రి వేళల్లో మద్యం తాగడం, చెత్త డంపింగ్ యార్డ్‌కు గోడ, రోడ్ల నిర్మాణం, వాన నీరు సాఫీగా వెళ్లేలా కాలువలు నిర్మాణంపై వ్యాపారులు ఎమ్మెల్యేకు వివరించారు. చర్యలు చేపట్టాలని అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో తిరుగుతూ వ్యాపారులను 'వ్యాపారం ఎలా సాగుతుంది.ఏమైనా సమస్యలు ఉన్నాయా' అని అడిగారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాండు నాయక్, ఈఈ సుదర్శన్, శానిటేషన్ డీఈ దేవేందర్ రెడ్డి, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, స్ట్రీట్‌లైట్ ఏఈ అనూష, మార్కెట్ అసోషియేషన్ ప్రధానకార్యదర్శి మధు, నాయకులు హరికృష్ణ, రాములు, మహేందర్, మహేష్ యాదవ్, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్ రాజు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైలులో మధ్యప్రదేశ్ వాసి ఆత్మహత్య


వివేక్‌సింగ్ మృతదేహం

అడ్డగుట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైలు బాత్‌రూమ్‌లో పురుగుల మందు తాగి మధ్యప్రదేశ్ వాసి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వేపోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆరో ప్లాట్‌ఫామ్‌కు ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో రక్సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. ఎస్-10కోచ్‌లో బాత్‌రూమ్‌లో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. బాత్‌రూమ్ తలుపులను పోలీసులు పగలకొట్టారు. మృతదేహం పక్కనే క్రిమిసంహారక మందు బాటిల్ పడి ఉంది. మృతుడు జేబులో లభించిన గ్యాస్ బిల్లు, ఆధార్‌కార్డు ప్రకారం మధ్యప్రదేశ్ జబల్పూర్‌కు చెందిన వివేక్‌సింగ్ లోడిగా పోలీసులు గుర్తించారు. మృతుడు వయస్సు 40-45 సంవత్సరాలుంటాయని పోలీసులు తెలిపారు. ఆర్థిక, కుటుంబ, అనారోగ్య సమస్యల వలనే మృతుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించామని, మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని పోలీసులు తెలిపారు.